# రాముడి సెలవులు

(కథానిక)

రాముకు పరీక్షలైపోయినై. సెలవు లిచ్చారు. బాగానే వ్రాశాడు రాము. తప్పకుండా ప్యాసవుతాడు. ఆ ధైర్యం వాడికి వుంది.

సెలవు లిచ్చినరోజున రాము తనతోటి స్నేహితుల్ని కలుసుకున్నాడు ఆ సంవత్సరానికి చివరిసారిగా. అప్పుడు అందరూ సెలవులు తాము ఎట్లా గడపదల్చుకున్నదీ వెలిబుచ్చారు. అంతవరకూ రాముకు సెలవులగురించి ఒక అభిప్రాయం లేనేలేదు. అసలు వాటిని గురించి ఒక ఆలోచన అవసరంఅనే అభిప్రాయంగూడా వాడికి కలగలేదు. నిజంగా సెలవు లెట్లా గడపాలి?

గోపాలం విచిత్రమైన కుర్రాడు. ఆబృందం అంతటికీ అతనే పెద్ద. అతనన్నాడు: "సెలవులు రెండు నెలల మీద పదిహేను రోజులు. ఈ అరవైఅయిదు రోజులూ నేనేం చేస్తానో తెలుసా? లేచింది మొదలు, పడుకునే దాకా, ఆ గ్రంథాలయంలోనే కూర్చుని రకరకాలైన పుస్తకాలూ చదివేస్తాను. మన మేష్టారు చెప్పలా సెలవుల్లో జనరల్ పుస్తకాలు చదివి ప్రపంచజ్ఞానం సంపాయించాలని? ఒక్కక్షణం వృథా చెయ్యను తిండి మొదలైన అవసరాలకు తప్ప. ఒరే మాణిక్యం యీ సెలవుల్లో నువ్వూ నాతో రారాదూ? లేక మీవూరు వెళ్ళిపోతావా? మీవూరు వెళ్ళిపోతే నీకేముంది? పలకరించేవా డుండడు, అల్లరిచిల్లరి ఆటలకు తప్ప. నిజంగా కాదూ?" మాణిక్యం దెబ్బతిన్నట్లు ఫీలయ్యాడు. "నేనేం అల్లరిచిల్లరి ఆటలకోసం కాచుక్కూర్చున్నా ననుకున్నావా? చూడు నాతడాఖా. నీలాగా పుస్తకం పురుగులా కాకుండా నియమం ప్రకారం చదివి వొచ్చే సంవత్సరం నీకన్నా ఎక్కువ మార్కులు సంపాయించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తాను" అన్నాడు.

"నన్నడిగితే సెలవుల్లోనూ క్లాసు పుస్తకాలు చదవడంకన్నా మరో దరిద్రం లేదు. ఎందుకూ సెలవులు? కులాసాగా గడపటానిక్కాదా? బడివున్న రోజులకూ లేని రోజులకూ తారతమ్యం యేమిటి మాణిక్యం నీకు?"

తనమీదికి వేణు గూడా యుద్ధానికి రావడంతో మాణిక్యం అట్టుడికిపోయినాడు. "మరి నువ్వేం చేస్తావో చెప్పు సెలవుల్లో?" అన్నాడు.

"అది నే నిప్పుడప్పుడే చెప్పలేను. నిజానికి నాకు తెలియదేమోకూడా. మా మామయ్య వున్నాడు, స్కూలుఫైనలు పరీక్షకు వెళ్ళేదే మొన్న, ఆయన. ఆయన సలహా తీసుకుని ఆ ప్రకారం చేస్తాను. స్కూలు పుస్తకాలు ముట్టితే వొట్టే" అన్నాడు వేణు.

చివరికి రాము వంతు వచ్చింది. అతనేమీ చెప్పలేకపోయాడు, సెలవుల్లో తన కార్యక్రమాన్ని గురించి. "ఆ సమయానికి ఏది సమంజసంగా తోస్తే అది చేస్తాను." అన్నాడు టూకీగా. స్నేహితుల్ని వదుల్చుకోవడానికి అట్లా అన్నాడేగాని, నిజానికి ఆ సమస్య అతని హృదయంలో ముఖ్యస్థావరాన్నేర్పరుచుకూర్చుంది.

"ఏం చెయ్యాలి సెలవుల్లో"

పూర్వానుభవం అసల్లేదు. పదేళ్లు నిండీనిండని రాము అంతకుముందు యేదో చిన్నస్కూల్లో చదివాడు అయిదో క్లాసువరకూ. ఈసంవత్సరమే మొదటిఫారంలో జేర్చారు వాళ్ళనాన్న. పరీక్షలు అయిపోయినయా, మళ్ళీ బళ్లు తెరిస్తే రాము రెండో ఫారంలో కూర్చుంటాడు. రాము చిన్నిబుర్రకు వేణు చెప్పిన వేదాంతం సరిగ్గా అతికింది. సెలవుల్లోనూ క్లాసు పుస్తకాలే చదివితే, యిక బడివున్న రోజులకీ వీటికీ తారతమ్యం ఏమిటి? సెలవుల్లో క్లాసు

"శ్రీ విరించి"

పుస్తకాలు చదివేకన్నా పాతకం మరోటిలేదు.

ఇంటికి వస్తూనూ, దార్లో గూడా యిదే ఆలోచించాడు. ఇంటి దగ్గరా యిదే ఆలోచించాడు. సరైన విషయం ఒకటీ తోచటం లేదు. భోజనాల దగ్గర రాముని తండ్రి పలకరించారు. "నీ పరీక్షలన్నీ అయిపోయినైగదరా బాగా వ్రాశావా?" అన్నారు.

"వ్రాశాను, నాన్నగారూ—"

"సెలవు లెన్నిరోజులు?" తల్లి అడిగింది.

"అరవై అయిదు రోజులు" బిక్కుబిక్కుమంటూ తల్లివైపు చూచి జవాబు చెప్పేడు రాము. వెంటనే తల్లి అందుకుంది, "ఈ సెలవుల్లో యిక చదువు లేదన్న మాటేగా! అల్లరికంతుండదన్నమాట. ఇల్లోకడకు తెస్తావు. అంతేనా?"

తల్లికి తనంటే ఇంత పగ ఎందుకో రాముకర్థం కాలేదు. ఇప్పుడే గాదెప్పుడూ యింతే. తనకు నచ్చనివన్నీ చెయ్యమంటుంది. చెయ్యనంటే అల్లరి వాడంటుంది. తండ్రితో చెబుతుంది. కొట్టిస్తానంటుంది. ఇంకా నానా హంగామా చేస్తుంది.

ఒకటి రెండ్రోజులు గడుస్తున్నయ్. రాము ఆలోచనకు అంతుదొరకలేదు. క్షణమో యుగంగా గడుపుతున్నాడు కాలం తల్లి కంట బడకుండా తప్పించుకొంటూ. అక్కడికీ ఒకటి రెండుసార్లు ఆ భోజనాల దగ్గరే అంది తల్లి,

"చదువులేదు. పోనీ ఆ సెకండు ఫారం పుస్తకాలుకొని చదివించరాదూ యింటిదగ్గరే? అన్నీ మర్చిపోతాడు. ఎందుకూ పనికిరాడు మళ్ళీ బళ్లు తెరిచేసరికి."

తండ్రి అడ్డం వచ్చేరు. "చాల్చాల్లే. వాడి నీరెండు నెలలన్నా కులాసాగా గడపనీ. సెకండ్ ఫారం పుస్తకాలు యిప్పుడే చెబితే తీరా బళ్లు తీసేక వాడేం చదవాలి? ఉభయభ్రష్టత్వంగా తయారౌతాడు. ఆ ప్రయత్నాలేం చెయ్యకు. వాడి యిష్టం వచ్చినట్లు నడవనీ సెలవుల్లో" అన్నారు. తల్లికి కోపం వచ్చింది. తనేం వాడిని పాడు చెయ్యాలనా వుద్దేశ్య పడుతున్నది? ఏంచెప్పినా వాడి బాగు కోరేకదా. అలాంటప్పుడు, వాడి చదువు విషయంలో తనమాట ఎక్కనియ్యకుండా చేయడం యెందుకు? "మీ యిష్టం వచ్చినట్లు చేసుకోండి. నాకేం సంబంధంలేదు. చూసుకోండి, వాడి సెలవుల వెనక పోకిరీగా తయారు గాకపోతే" అంది సహజ కోపస్వరాన. రాముతండ్రి నవ్వారు పక్కన. రాముకు యెటూ తోచలేదు. తన తల్లి తత్వం వాడికి అర్థం గాకపోతే ఆ తప్పు వాడిదిగాదు.

"పోనీ, మా వూరు రారా రామూ. మా గోపాలం సరిగ్గా నీ యీడువాడే, వాడికీ సెలవులు యిచ్చి వుంటారు. ఇద్దరూ హాయిగా గడపవచ్చు కాలం. మా వాడు పోకిరీ కాదు గదా!" అంది జానకమ్మగారు కొద్దిగానవ్వుతో. జానకమ్మ గారంటే, రాము తల్లికి అక్కగారు. ఆవిడ రెండు నెలలై రాము అక్కకు పురుడు పొయ్యడానికి వచ్చి, మరో రెండు మూడు రోజుల్లో తిరిగి తనవూరు ప్రయాణం అవబోతున్నది. ఈ క్షణంలో రాముకు తన తల్లికీ, పెద తల్లికీ వున్న తారతమ్యం కళ్లకు గట్టినట్లయింది. ఇలాంటి సలహాలు తన తల్లే యెందుకు యీయరాదు అనవసరంగా దెప్పి పొడవటానికి నీళ్ళుధారవదలి? రాము తండ్రి మొఖం వైపొకసారి, తల్లి ముఖం వైపొకసారి చూచి, ఆ వెనక జానకమ్మగారి వైపు చూచాడు. ఆమె ముఖం "ఏం వస్తావు గదూ!" అని లాలనగా అడుగుతున్నట్లున్నది. తండ్రి ముఖంలో అతని కేభావమూ స్పష్టంగా బోధపడలేదు గాని, తల్లి ముఖం మాత్రం– 'నువ్వు పోకిరీవి' అన్నట్లుగా ఎకసక్కెం చేస్తూవుంది.

"వాడంటే అంతపగ నీకెందుకు?" అన్నారు రాము తండ్రి భోజనమై లేస్తూ.

"పగ కాదు వుద్ధరి. నాకెందుకు, మీమీ యిష్టాలు." అన్నదామె. ఆ 'మీ'లో తన్ను గూడా జతపర్చిందని జానకమ్మగారికి గ్రహించేందుకు ఎక్కువకాలం పట్టలేదు.

రాము క్షణంలో పెద్దమ్మగారి వూరు వెడదామనే నిశ్చయానికి వచ్చాడు.

"రాముని నాతో తీసుకెడతాను, వాడు పోకిరీ అవకుండా చూచేబాధ్యత నాది. మరేం ఫరవా లేదులే, మా గోపాలానికి జతగా వుంటాడు. ఇద్దరూ ఒక యింట్లో తిరగటం చూడాలని ముచ్చటగా వున్నది" అంది జాన

కమ్మగారు రాము తల్లితో. ఆమె యేమీ మాట్లాడలేదు. కాని ఆమెకు మరోవుపాయం కూడా తోచింది. "రాము తన అక్కతోనే యెందుకు వెళ్ళరాదు? చంటిపిల్లతో అది మొగుడికి వేళకు వండిపెట్టలేదు. కనీసం చంటిపిల్లను ఆడించటానికైనా పనికివస్తాడు వీడు. జానకమ్మగారి యింట్లో వీడికి కాలక్షేపం మాత్రం యేమౌతుంది, ఎంత గోపాలంగాడున్నా?" అనుకొన్నదావిడ. అయితే యీ అభిప్రాయాన్ని అక్కగారి దగ్గర వ్యక్తపరచ లేకపోయింది. ఆ పని తన భర్తదగ్గిర చేసింది. ఆయన "వాడు ఎక్కడికో ఎక్కడికి వెళ్ళటం అవసరమే యీ సెలవుల్లో. ఎక్కడికి వెళ్ళేదీ వాడినే నిశ్చయించుకోమను. వాడిష్టమైన చోటికి వెడతాడు. మన ప్రమేయం ఎందుకు?" అన్నారు.

రాము అక్క అడిగిందతన్ని, "నాతో వస్తావా, లేక పెద్దమ్మగారివూరు వెడతావా?" అని. ఆలోచించాడు రాము. "త్వరగా చెప్పూ" అంది అక్క.

రాము తన అక్కగారింటికి యిదివరలో ఒకపర్యాయం వెళ్ళాడు. "వాళ్ళ యిల్లు చాలా చిన్నది. స్వేచ్ఛగా మెదలేందుకు వీలులేనంత చిన్నది. అయినా అక్కడ తనకేమీ తోచదు. అక్క యెక్కడికీ బజారుకు అయినా కనీసం పోనివ్వదు. అదేం చిత్రమో గాని దాని కన్నీ అమ్మ గుణాలే అబ్బినై. ఆమాట నాన్నగారు కూడా అంటూంటూ రప్పుడప్పుడూ. బావ యెప్పుడూ యింటవుండడు. ఎప్పుడూ 'ఆఫీసు, ఆఫీసు' అని కలవరిస్తో వుంటాడు. తనూ, అక్కా ఒకరికొకరు యెదురుబడి కూర్చోవాలి. ఇప్పుడీ పిల్లవొకతె. తనకిక అస్తమానం దాన్ని ఎత్తుకోటం తప్ప మరో పని వుండదు! అక్కడికి వెళ్లడంకన్నా యిక్కడ వుంటమే చాలా నయం" అనుకొన్నాడు రాము. "పెద్దమ్మగారి వూరు చాలా పెద్దదిట! చాలా అందమైందిట కూడా. గోపాలం తెలివిగలవాడని అనుకోటం అనేకమార్లు విన్నాను. వాడిని కళ్ళతో ఒక్కమారన్నా చూళ్లేదు. కొత్తవాళ్ళతో పరిచయం చేసుకోవాలి గాని, ఎప్పుడూ 'పాత' ఎందుకు? పెద్దమ్మగారి యింటికే పోతాను..." రాము లోగడ చేసుకున నిశ్చయాన్ని యీ చర్చతో గట్టి చేసుకున్నాడు.

పెద్దమ్మగారి వూరు వెళ్ళేందుకు యింకా రెండు రోజులుంది. ఈ రెండు రోజుల్లోనూ, రాము ఆవిడకు సన్నిహితంగా తిరగనారంభించాడు. రాము అక్క, తల్లి, ఒక్కసారిగా వాడిని వెలివేశారు మనసుల్లో. రాము తన అక్కకు నచ్చజెప్పటానికి ప్రయత్నించకపోలేదు. కాని ఆ ప్రయత్నం చేయకండా వున్నట్లయితేనే బాగుండేది.

ఏమైనా రాము తననిశ్చయాన్ని మార్చుకోదలచలేదు. ఆఖరుకు రెండు రోజులూ గడిచి, ఊరికి వెళ్ళేరోజు వచ్చింది. రాము తన చిన్న పెట్టెతో ప్రయాణం అయాడు. తండ్రిదగ్గిరా, అమ్మదగ్గిరా అక్కదగ్గిరా వరసగా సెలవుతీసుకుని, పెద్దమ్మగారి ప్రక్కనే బండిలో చదికిలపడ్డాడు. రాము తల్లి అంతమాత్రంచేత వాడిని క్షమించిందనటానికి లేదు. కాని బయట పడకండా జాగ్రత్తపడింది ఎటొచ్చీ యేమనగలదు? జానకమ్మగారు పరాయిది కాదుగదా, స్వంత అక్క!

రైలు ప్రయాణం నాలుగుగంటలు చేశాక, పెద్దమ్మగారి వూరు వచ్చింది. స్టేషను సమీపిస్తుండగానే, అక్కడ కట్టివున్న బోర్డుమీద పేరు బిగ్గరగా చదివాడు. జానకమ్మగారు "అదే మన వూరు." అన్నది. "నాకు తెలుసు" అన్నట్లుగా ముఖాన్ని ఆనందతరంగాల్లో ముంచేశాడు రాము. జానకమ్మగారు అంతకు ముందే భర్తకు వుత్తరం వ్రాయించి వుండటంవల్ల, స్టేషనుకు బంట్రోతుని పంపారాయన. బండి ఆగగానే, ప్లాటుఫారంమీదికి ఎగాదిగా చూచింది జానకమ్మగారు. ఇంతలో బంట్రోతు వెంకన్న ఆ పెట్టెదగ్గరికి రానేవచ్చాడు.

సామానంతా దింపారు. వెంకన్న జట్కాబండి ఒకటి తీసుకువచ్చాడు. అయిదు నిమిషాల్లో యింటి ముందు ఆగింది బండి. "అరుగో పెద్దనాన్నగారు" అని చూపించి, పరిచయం చేసిందావిడ తన భర్తను రాముకు. "ఏం-రామూ, పరీక్ష బాగా వ్రాశావుగదూ?" అన్నారు పెద్దనాన్నగారు. తలూపాడు రాము. తరవాత పెద్దమ్మగారితో యింట్లోకి వెళ్ళి

అంతా పరిశీలించాడు ఇల్లు విశాలమైనది. చుట్టూ తోట. పూలన్నీ పూచి రకరకాలైన రంగుల్నీ వాసనల్నీ విరజిమ్ముతున్నాయి. వాటి ఆకారం, అందం చూస్తూ రాము తన్మయుడైపోయాడు. సరిగ్గా భోజనాలవేళ అయే సరికి గోపాలం వచ్చేడు. గోపాలం యింట్లోకి వస్తూనే, "అమ్మ వచ్చిందా?" అని ప్రశ్నించటం విన్నాడు రాము. జానకమ్మగారు గోపాలాన్ని పిల్చింది. "గోపాలం, యీ కుర్రాడిని యెప్పుడైనా చూచావూ?" అందావిడ. "ఇంకెవరు? రాము. అంతేనా?" అన్నాడు.

రాము గోపాలాన్ని చూస్తూనే అదోలా అయిపోయాడు. పేరొకటే అయినా, యింత వరకూ తన స్నేహితుడిగావున్న గోపాలానికీ, యితనికీ సంబంధమే లేదు. ఈ గోపాలం రాముకన్నా ఒక జానెడు పొడుగెక్కువ. వయస్సులో ఒక రెండేళ్లు ఎక్కువేనాయె! ప్రథమవీక్షణంలోనే గోపాలం రాముని ఆకర్షించాడు.

కొన్ని గంటల్లోనే రాము, గోపాలం స్నేహితులైపోయారు.

"నా పుస్తకాల గది చూపిస్తా రా" అని గోపాలం రాముని ఒకగదిలోకి తీసుకువెళ్లాడు. అక్కడ తరగతి పుస్తకాలే గాకండా, ఇంకా బొమ్మల పుస్తకాలూ, కథల పుస్తకాలూ, పాటల పుస్తకాలూ అనేకం కనిపించాయి. అవన్నీ తనకు చదవటానికి కనీసం ఆరు నెలలయినా పడుతుందని ఎట్లాగో రాము వూహించుకొన్నాడు.

మొదటి రోజు భోజనం అయాక, రాము పుస్తకం తీసి చదవటం మొదలెట్టాడు. కొన్ని పేజీలుమాత్రమే చదివింతర్వాత అతనికి భరించరాని నిద్రవచ్చింది. పోగూడదనుకున్నాడు గాని, శక్తికి మించిన పనయింది. నిద్ర లేచే సరికి సరిగ్గా నాలుగున్నరయింది. తనకోసం గోపాలం కాచుక్కూర్చున్నాడు. "త్వరగా ఫలహారం చేసిరా పోదాం" అన్నాడు గోపాలం. "ఎక్కడికి?" అందామనుకున్నాడుగాని యెందువల్లనో అనలేదు. గదినించి యివతలికి వచ్చేసరికి పెద్దమ్మగారు కనిపించారు. "మొఖం కడుక్కొని రా" అన్నదావిడ. ఆమె చెప్పినట్లల్లా చేశాడు రాము.

"నే నెప్పుడూ పగలు నిద్రపోను. ఇవాళేదో బడలికగా వుండి..." యేదో తప్పు చేసినట్లు బాధపడి క్షమాపణ కోరుతూ అన్నాడు గోపాలంతో రాము.

"నేనూ అదే అనుకున్నాను."

బజారుకు బయల్దేరారిద్దరూ. "చీకటి పడకండా యింటికి రాండి" అన్నది జానకమ్మగారు. ఆ సాయంత్రం గోపాలం వూళ్ళోని కొన్ని రమ్యమైన ప్రదేశాలు చూపించాడు తమ్ముడికి.

"ఈ సంవత్సరం వున్నంత తీరుబడి నాకు వచ్చే సంవత్సరం వుండదు. ఎందుకంటే నేను చదవబోయేది నాలుగోఫారం. కింది తరగతుల కన్నా అది చాలా కష్టం అని అంటారంతా. నన్ను బి. యే. దాకా చదివిస్తానంది మా అమ్మ..." ఇంకా లక్ష సంగతులు చెప్పాడు గోపాలం. అన్నీ రాముకు కొత్తగానే వున్నయ్. ఆ పేర్లనే అధమం వినివుండలేదు యింతకు ముందు.

ఇంకా సెలవులు పరిశిష్టం ఒక నెల వున్నదనగా, రాము ప్యాసయినట్లు వుత్తరంవచ్చింది. అంతకుముందే గోపాలం పరీక్షా ఫలితం తెలిసింది. తను ప్యాసయినట్లు తెలిసిన తర్వాత రాములో గొప్ప మార్పేమీ లేదు. తను శ్రద్ధగా చదివాడు, బాగా రాశాడు, ప్యాసయాడు. కాని సత్యం తప్పిపోయాడనే వార్తమాత్రం రాముని కుంగదీసింది. సత్యం యేమంత తెలివిగలవాడు కాడు. మతి మరపు యెక్కువ. కాని బాగా చదువుతాడు. తను చదివేదానికన్నా యెక్కువసేపు, యెక్కువసార్లు చదువుతాడు. కాని తెలివితేటలు లేనికారణంగా తప్పాడు. మిత్రబృందంలో అంతా ప్యాసయ్యారు. సత్యం తప్ప. సత్యం బాగానే రాశానన్నాడు, ప్యాసు మార్కులు రావచ్చునన్నాడు. కాని రాలేదు.

సత్యాన్ని ఓదార్చాల్సిన అవసరం రాముకు యెక్కువగా కనిపించింది.

రాము తల్లి రాసిన వుత్తరంలో, వాడిని వీలైనంత త్వరగా పంపమనిగూడా వుంది.

అందుకని జానకమ్మగారు "యేంరా, రాము, వెడతావా? ఈ నెల రోజులూ వుంటావా? అనడిగింది. ఏంచెప్పాలో రాముకు అర్థంగాలేదు కొంత సేపటిదాకా.

పరీక్ష తప్పిపోవటాన్ని గురించి గోపాలం, ఒకసారి రాముకు చిన్న లెక్చరిచ్చాడు: "పరీక్ష అంత దుర్భాగ్యమైనవి ఇంకేమీ లేవు. చూడు, చదివిన లక్ష విషయాల్లో యే పదో అడుగుతారు. సరిగ్గా ఆ పదే వదిలి చదివినవాడు యెందుకూ పనికిరాడు కదా! పరీక్ష తప్పటంకన్నా మరో అవమానం లేదు. ఆ అవమానంతో కార్ల కిందా, రైళ్ళకిందాపడి ఆత్మహత్య చేసుకొన్నవాళ్ళూ వున్నారు, నదుల్లో దూకి చచ్చినవాళ్ళూ వున్నారు. కాని చచ్చి యేం లాభం?..."

రాము వెడతానన్నాడు. "ఏం?" అనడిగింది జానమ్మగారు. సకారణంగా చెప్పాడు. పైగా యింకో నెలేగదా వున్నది బడి తెరిచేందుకు. అదీగాక, అమ్మను విడిచి నెలపై పదిహేనురోజు లయింది.

రాము వెడుతూ వెడుతూ గోపాలాన్ని కూడా రమ్మన్నాడు. "ఎట్లాగూ వాడిని దింపి రావటానికి కొకళ్లు వెళ్లాలిగా! వెళ్లు తోడుగా" అన్నది గోపాలాన్ని తల్లి. గోపాలం తమ్ముడి కోరికనూ, తల్లి ఆజ్ఞనూ నిరాకరించలేదు.

తమ్ముడితో వెళ్లిన గోపాలాన్ని చక్కగా ఆదరించారు రాము యింట్లో. రాము తన స్నేహితులందర్నీ పరిచయం చేశాడు. నాలుగు రోజులయ్యాక గోపాలం తన దారిన తను వెళ్లిపోయాడు.

రాము మళ్ళీ మామూలు మనిషయ్యాడు. తను ఆవూళ్ళో- పెద్దమ్మగారి వూళ్ళో చూచిన మనోహర దృశ్యాలూ, గోపాలం ద్వారా విన్న కథలూ, మాటలూ నెమరుకు తెచ్చుకొంటూ మిగతా సెలవుల్ని గడిపాడు.

రోజులెంత సేపట్లో గడుస్తై? మళ్ళీ బడులు తెరిచారు. తను సెలవులు రెండు నెల్లూ ఎలా సార్థకం చేసుకున్నదీ తల్చుకుంటూ రాము బడికి బయల్దేరాడు, తన స్నేహితులందర్నీ కలుసుకోటానికి.

కథానిక

# బంధువులు

సరిపల్లి ద్వారకనాథ్

ఎలాగయితేనేం శాంతని పుట్టింటికి పంపటానికి చివరకు ఒప్పుకొన్నాను. మా అత్తగారి (శాంత తల్లి) ఆరోగ్యస్థితి మళ్ళీ గత నాలుగు రోజులనుంచీ విషమించిందనీ, ఆవిడగారు నన్నూ శాంతనీ చూడాలని చాల ఆత్రుతతో ఉన్నదనీ, ఉత్తరం అందిన వెంటనే మా యిద్దర్నీ బయలుదేరి రమ్మనీ, మామయ్య వ్రాసిన ఉత్తరం నిన్ననే అందింది. ఈ ఆఫీసు గొడవల్లో అసలు ఊపిరి తీసుకోటానికే నాకు టైము లేకపోతోంది. నేను వెళ్లటము ఎల్లాగూ వల్లకాదు. అందులోనూ నేను సరిగ్గా పని చేయటంలేదని ఆఫీసరు పై అధికారులకు నా మీద రిమార్కు వ్రాశాడు. ఈ పరిస్థితుల్లో సెలవు పెట్టేనంటే చాల ప్రమాదం.

పోనీ శాంతను ఒక్కర్తెనే పంపిద్దామంటే, పదిహేను, ఇరవై రోజుల వరకూ పుట్టింటిలోనే ఉంటానంటోంది. అన్నాళ్లూ నేను అయ్యరు హోటల్లో కప్ మీల్సు తీసుకుని ప్రాణం నిలబెట్టుకోవాలి. భోజనం విషయంలో నేను బకాసురుడికి రమారమి తమ్ముణ్ణి అవుతాను. అటువంటప్పుడు ఉడికీ ఉడకని మెతుకులను రాళ్ళతో మిశ్రమంచేసి, రేషన్ పద్ధతి ప్రకారం అయ్యరు నాకు వడ్డిస్తే యెలాగు జీవించగలనూ అంట? భోజనం దగ్గర శాంత మాటిమాటికీ తన తీయని కబుర్లతో నన్ను గిలిగింతలు పెట్టకపోతే నాకు అసలు ముద్ద గొంతుక దిగదు. ముఖ్యంగా, శాంత లేకపోతే యింట్లో నేనొక్క క్షణం ఉండగలనా అసలు? అందుచేత శాంతని పుట్టింటికి పంపటానికి మొదట్లో నేను అంగీకరించని మాట వాస్తవమే.